మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 175 | మంగళవారం 27 మే 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-







# కేసీఆర్ మనసులో పడితే ఖతమే..




- కేసీఆర్ తో ట్యూన్ కాగలిగినవారికే చోటు.. వేరే వాళ్లకు దూరమే
- కవిత విషయంలోనూ నెగటివ్ అభిప్రాయం ఏర్పడినట్టే
- కేసీఆర్ రాచరికపు ధోరణి పార్టీని కొంపముంచింది
- నమ్మిన వారిని వాడేసుకుని వదిలేసే వ్యక్తిత్వం కేసీఆర్‌దే
- హరీశ్ రావు ఎపిసోడ్ 2016 నుంచే నడుస్తోంది
- 'కేసీఆర్ అవసరానికి వాడుకుంటారు, తర్వాత పక్కన పడేస్తారు' - ఈటల

# ఆమె ఐఏఎస్ అధికారినా లేక పాకిస్తానీనా.?

## వివాదంగా బీజేపీ నేత కామెంట్స్..




కర్ణాటక బిజెపి ఎమ్మెల్సీ ఎన్ రవికుమార్ ఒక మహిళా ఐఏఎస్ అధికారిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. కలబురిగిలో జరిగిన ఒక సభలో రవి కుమార్ మాట్లాడుతూ.. శాసనమండలిలో ప్రతిపక్ష నేత చలవాడి నారాయణ స్వామి పట్ల వ్యవహరించిన తీరుపై ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ మద్దతుదారులు ప్రభుత్వ అతిథి గృహాన్ని ముట్టడించిన సమయంలో ఆయన లోపల ఉన్నారు.

అయితే, ఈ సంఘటనను ప్రస్తావిస్తూ.. కలబురిగి డిప్యూటీ కమిషనర్ ఫౌజియా తరణమ్ జాతీయతను గురించి ప్రశ్నించడం వివాదంగా మారింది. "కలబురగి డిసి పాకిస్తాన్ నుండి వచ్చారో లేదా ఇక్కడ ఐఎఎస్ అధికారియో నాకు తెలియదు. మీ చప్పట్లు చూస్తుంటే, డిసి నిజంగా పాకిస్తాన్ నుండి వచ్చినట్లు అనిపిస్తుంది" అని అన్నారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్ కొత్త కాదు..

## 1952-67 వరకు ఒకేసారి ఎన్నికలు..!




- వన్ నేషన్ వన్ ఎలక్షన్ కరుణానిధి కల..ఇప్పుడు స్టాలిన్ వ్యతిరేకం ఎందుకు?
- ప్రాంతీయ పార్టీలకు నష్టం అంటూ డీఎంకే వాదన విడ్డురం
- దేశానికి ఎప్పటికప్పుడు ఎన్నికలు భారం..వన్ ఎలక్షన్‌తో అభివృద్ధికి ఊపొస్తుంది
- "దక్షిణాది నేతనైన నేను వన్ నేషన్ ఎలక్షన్‌కు మద్దతు ఇస్తున్నా" -పవన్ కల్యాణ్..




# వెన్నుపోటు పొడిచేదెవరో తెలిసింది..

- బీఆర్ఎస్‌ను వదిలిన ఎమ్మెల్యేలపై ఉపఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- ఈ దశాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టోనే: కేటీఆర్ విమర్శలు
- కేసీఆర్ తిరిగి రావాలనేది ప్రజల కోరిక
- 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదం ఇప్పుడు 'నిందలు, దందాలు, చందాలు'
- కాంగ్రెస్‌ను నమ్మిన ప్రజలు బొక్కబోర్లా పడ్డారు - కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీని వీడిపోయిన ఎమ్మెల్యేలకు ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 18 నెలల కాంగ్రెస్ పరిపాలన చూశాక ఈ దశాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టోనేనన్నారు. సోమవారం తెలంగాణ భవన్ లో గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ లో చేరారు. వారందరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ దరిద్రాన్ని ఎన్ని రోజులు చూడాలి మళ్లీ కేసీఆర్ వచ్చేలా ఏదైనా ఉపాయం చూడరాదా అని ప్రజలు అంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి ఉపాయమేమి లేదని ఏ పది మంది ఎమ్మెల్యేలు మన పార్టీని వీడి పోయారో ఆ పదిమందికి ఉపఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టడమే ఉపాయం అన్నారు. కుండ పగిలితే పగిలింది కుక్కబుద్ధి తెలిసింది అన్న చందంగా మనోడెవడో మనతో ఉంటూనే వెన్నుపోటు పొడిచేదెవడో తెలిసిందన్నారు.



మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచిపెట్టిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మరొకసారి పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సిందూర్ అనేది వివాహానికి సంకేతమని.. దానిని తుడిచివేయడం అంటే వైధవ్యాన్ని సూచిస్తుందన్నారు. మన సోదరీమణుల నుదిట నుంచి దాన్ని తుడిచేసే ధైర్యం చేసిన వాళ్లను ఖతం చేశామని చెప్పారు. ఇక మోడీని ఢీకొట్టడం ఎంత కష్టమో ఉగ్రవాదులు కూడా కలలో ఊహించి ఉండకపోవచ్చన్నారు. మన త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని.. దీంతో ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచం చూడని విధంగా అద్భుతాలు సృష్టించారని ప్రశంసించారు.

భారతదేశం పట్ల దాయాది దేశం పట్ల ద్వేషం కక్కుతోందని.. భారత్‌కు హాని చేయాలనే పాకిస్థాన్ కోరుకుంటోందని తెలిపారు. భారత్ లక్ష్యం పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం, అభివృద్ధిని చెందిన దేశంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. ఇక వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధిని తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని చెప్పారు. హోలీ, దీపావళి, గణేష్ పూజ వంటి పండుగల సమయంలో భారతదేశంలో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఉపయోగించాలని ప్రజలను మోడీ కోరారు. విదేశీ దిగుమతులను కొనుగోలు చేయడం మంచిది కాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వదేశంలో తయారైన వస్తువులనే కొనుగోలు చేసేందుకు సంకల్పించుకోవాలని కోరారు.

# నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం

- ఆపరేషన్ సిందూర్ ఘన విజయం.. ఉగ్రదాడికి 22 నిమిషాల్లో ప్రతీకారం
- ఉగ్రవాదుల కలల్లో కూడా మోడీని ఢీకొట్టలేరు
- భారతీయుల భావోద్వేగాలకు ఇచ్చిన సమాధానమే ఆపరేషన్ సిందూర్
- భారత్ లక్ష్యం అభివృద్ధి - పాకిస్తాన్ లక్ష్యం విద్వేషం: ప్రధాని విమర్శ
- స్వదేశీ ఉత్పత్తులు వినియోగించండి
- భారత శక్తి, స్వేచ్ఛ, సైనిక తేజానికి సాక్ష్యం - ఆపరేషన్ సిందూర్: ప్రధాని

ఇక అంతకముందు వడోదర విమానాశ్రయం నుంచి నగర శివార్లలోని వైమానిక దళ స్టేషన్ వరకు మోడీ రోడ్ నిర్వహించారు. స్వాగతం పలికిన జనంలో కల్నల్ ఖురేషి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు. దీనికి ప్రతీకారంగా భారత్.. ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్‌లో పలు చోట్ల వైమానిక స్థావరాలు నాశనం అయ్యాయి. అయితే పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.

2 లో

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ..

## ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించాం..




సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాన్స్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ మీటింగ్ కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరు అయ్యారు. గత ఆరు నెలల క్రితం ప్రయోగాత్మకంగా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రాఫిక్ అసిస్టెంట్గా ట్రాన్స్ జెండర్లను తీసుకుంది. కేవలం పది రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్ను నియమించి తెలంగాణ సర్కార్ రికార్డు సృష్టించింది.

# ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు..? హరీష్ రావు

- అందాల పోటీలకు రూ.200 కోట్లు.. రైతులకు మాత్రం విత్తనాలు లేవు
- ఫ్యూచర్ సిటీలకు వేల కోట్లు.. రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదు
- కాంగ్రెస్‌కు ముదిరాజ్‌లపై చిత్తశుద్ధి లేదు
- మిస్ వరల్డ్ పేరిట విందులు .. రైతులకు అవసరమొచ్చినప్పుడు ఖజానా ఖాళీనేనా ? - హరీష్ రావు





## దాడులపై 30 నిమిషాల్లోనే పాకిస్తాన్‌కి సమాచారం అందింది: జైశంకర్

పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత్, పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని "ఆపరేషన్ సిందూర్" ప్రారంభించింది. మొత్తం 09 లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, భారతదేశం ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత 30 నిమిషాల్లోనే పాకిస్తాన్ అప్రమత్తమైందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీకి తెలియజేసినట్లు తెలిసింది.

2 లో

## నేటి మాట

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవటం, ఎదుటివాళ్ళ మాటకూడా విలువనివ్వటం అలవరచుకొంటే జీవితంలో ఒక ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చు



- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

# తెలంగాణను నంబర్ వన్ స్థానానికి తీసుకొస్తాం: భట్టి విక్రమార్క

- ప్రపంచం తెలంగాణ వైపు చూస్తోంది
- పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి ,త్వరలో పూర్తి చేస్తామన్న మంత్రి
- దెయ్యాలకు నాయకత్వం వహించే వ్యక్తి దేవుడా ? కేసీఆర్‌పై భట్టి సెటైర్లు
- ఇల్లు లేని కుటుంబం లేకుండా చూస్తాం: రూ.5 లక్షల నిధులతో నిర్మాణాలకు ప్రభుత్వం సిద్ధం
- నిరుపేదలకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సహాయం: భట్టి ప్రకటన




# చంద్రబాబు చేతిలో సీఎం రేవంత్ ఓ కీలుబొమ్మ..



మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సెటైర్లు

2 లో

- రైతుల వడ్లు మొలకెత్తినా పట్టించుకోని ప్రభుత్వం
- కేసుల భయంతో ప్రధాని కాళ్లు మొక్కే పని చేస్తున్న సీఎం రేవంత్
- బీజేపీ-టీడీపీ-కాంగ్రెస్ కలిసి తెలంగాణ నీళ్ల దోపిడీకి పాల్పడుతున్నారు
- పాలన చేతకాకపోతే రాజీనామా చేయండి: మంత్రి జగదీశ్ రెడ్డి

KR TV మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...
మంగళవారం 27 మే 2025

# కేసీఆర్ మనసులో పడితే ఖతమే..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ వ్యవహారం గులాబీ పార్టీలో దుమారం రేపుతోంది. కవితకు పార్టీకి మధ్య ఏం జరిగింది.. ఈ ఎపిసోడ్ లో ఇంకేం జరగబోతున్నదనే చర్చ రోజు రోజుకు ఉత్కంఠ రేపుతోంది. ఈ క్రమంలో కేసీఆర్ వ్యక్తిగత అంశాలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ఆ సక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఒక వ్యక్తిపై నెగిటివ్ అభిప్రాయం ఏర్పాటు చేసుకుంటే ఇక అతకడం అసాధ్యం అన్నారు. కూతురు కవిత విషయంలోనూ ఎక్కడో అలాంటి నెగిటివ్ అభిప్రాయం వచ్చి ఉంటుందన్నారు. తాజాగా ఓ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈటల.. కేసీఆర్ కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కేసీఆర్ తనకు తాను ఒక చక్రవర్తిల వ్యవహరిస్తారు. ఆయనకు ఎవరు ఎదురు చెప్పవద్దు, విమర్శించవద్దు. ఆయన పనులను తప్పుపట్టద్దు. 20 ఏళ్ళు కేసీఆర్ తో ఉన్నానని చాలా దగ్గరగా అన్ని గమనించారు. ఆయన ఛత్రంలో ఇమడని వారిని కేసీఆర్ దగ్గరకు రానివ్వరన్నారు. కేసీఆర్ రాచరికపు పోకడలు, నియంతృత్వం, నమ్ముకున్నోళ్లను ఆయన నట్టేట ముంచే పద్ధతి, వ్యక్తులను వాడుకుని వదిలేసే నైజం ఫలితమే రాజకీయంగా ఆయనను బొందపెట్టిందన్నారు. కవితకు వాళ్ల కుటుంబంలో ఎక్కడో ఏదో తేడా వచ్చిందని ఇక అతికే ప్రసక్తే లేదని హాట్ కామెంట్స్ చేశారు.

కేసీఆర్ కు మనం ట్యూన్ కావాల్సిందే తప్ప ఆయన మనకు ట్యూన్ కారని.. కూలిపోయే వరకు నేనే గొప్ప అనుకునే వ్యక్తి కేసీఆర్ అన్నారు. వాస్తవాన్ని అంగీకరించే మూడ్ లో కేసీఆర్ లేరని చెప్పారు. కేసీఆర్ మనసులో పడ్డవాడిని ఎక్కడున్నా ఎప్పుడైనా మళ్లీ అవకాశం వస్తే ఖతం పట్టిస్తారని హాట్ కామెంట్స్ చేశారు. ఒక వేళ దగ్గరకు తీసినా ఆయనకు అవసరం వచ్చినప్పుడు మళ్లీ బొందపెట్టే ప్రయత్నమే చేస్తారు తప్ప అన్ని మర్చిపోయి ముందుకు తీసుకువెళ్లరని అన్నారు. కేసీఆర్ ఎవరినైనా టార్గెట్ చేస్తే ఆయనకు మరో పని చేయరని అదే పనిమీద ఉంటారని అందులో ఎవరికి మినహాయింపు లేదన్నారు. గతంలోనూ హరీశ్ రావు, ఈటల కలిసి సొంత పార్టీ పెట్టబోతున్నారని జరిగిన ప్రచారం పై స్పందిస్తూ నమ్మకం లేని వాళ్లకు సుఖం తక్కువ అని సెటైర్ వేశారు. ఎవరో చెప్పిన మాటలు విని కేసీఆర్ తనను దూరం చేసుకున్నారని బయటకు వెళ్లడాకి కారణం ఎవరని ప్రశ్నించారు. హరీశ్ రావు ఎపిసోడ్ ఈనాటిది కాదని 2016 నుంచి నడుస్తోందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో హరీశ్ రావు టచ్ లో ఉన్నారంటూ జరుగుతున్న ప్రచారంపై ఈటల స్పందించారు. ఆయన మాతో టచ్ లో లేరని అన్నారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను నియమించాం..

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్లు అంటే సమాజంలో చిన్న చూపు ఉందన్నారు. కానీ దాన్ని అధిగమించి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమ సత్తాను చాటారు.. ట్రాన్స్ జెండర్లకు అవకాశాలు కల్పిస్తే రాణిస్తామని ట్రాఫిక్ అసిస్టెంట్లు నిరూపించారు.. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమశిక్షణతో వహిస్తున్నారు.. ప్రతి ఒక్కరిలో సమర్థత ఉంటుందని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ట్రాన్స్ జెండర్లు గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను నియమించాం.. ఈ విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ లోని ఉదయపూర్ లో నిర్వహించిన చింతన్ శివిర్ లో నేను ప్రత్యేకంగా ప్రస్తావించాను అని మంత్రి సీతక్క వెల్లడించారు.

ఇక, తెలంగాణ మోడల్ ను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు కూడా ఫాలో అవుతున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలుస్తోంది.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమను తాము నిరూపించుకున్నారు.. పోలీస్ శాఖలోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్లను నియమించే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు.. ఎక్కడ ట్రాన్స్ జెండర్ల మీద వివక్షత లేకుండా అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పిస్తాము అన్నారు. ట్రాన్స్ జెండర్లందరికీ ట్రాఫిక్ అసిస్టెంట్లు ఆదర్శంగా నిలుస్తున్నారు.. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గౌరవప్రద ఉద్యోగాలు చేసేందుకు ముందుకు రావాలి అని మంత్రి పిలుపునిచ్చారు. పోలీస్ డ్రెస్ లో ట్రాన్స్ జెండర్లను చూసి సామాన్యులు సెల్యూట్ చేస్తున్నారు.. ఒకప్పుడు అవమానాలు ఎదుర్కొన్న ట్రాన్స్ జెండర్లు ఇప్పుడు అపూర్వ గౌరవాన్ని అందుకుంటున్నారు అని చెప్పుకొచ్చారు. సీఎం ఇచ్చే అవకాశాలను ట్రాన్స్ జెండర్లు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క తెలిపారు.

# 14 రోజుల రిమాండ్‌కు యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా!



పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. హర్యానాలోని హిసార్ కోర్టు ఈ తీర్పునిచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్తాన్‌కు సమాచారం చేరవేస్తున్న వారిపై భారత ప్రభుత్వం కొరడా ఝుళిపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పాక్‌కు భారత సమాచారం అందజేస్తున్న 12 మందిని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో అరెస్టు చేశారు. వీరిలో జ్యోతి కేసు సంచలనం సృష్టించింది. ట్రావెల్ యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకున్న ఆమె.. పాకిస్తాన్ హైకమిషన్ ఉద్యోగులతో సంబంధాలు కలిగి ఉందని తెలిసి అంతా ఆశ్చర్యపోయారు.

పలుమార్లు పాకిస్తాన్‌కు వెళ్లిన ఆమె.. భారత్ బహిష్కరించిన పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిష్ అలియాస్ ఎహసాన్-ఉర్-రహీంతో కలిసి పాక్‌కు గూఢచర్యం చేసిందని ఆరోపణలు వచ్చాయి. అరెస్టయిన తర్వాత విచారణలో పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లతో కూడా తను టచ్‌లో ఉన్నానని, వాట్సాప్ వంటి ఎన్‌క్రిప్టెడ్ మెసేజ్ యాప్‌లతో వారికి సమాచారం చేరవేసేదాన్నని ఆమె ఒప్పుకున్నట్లు వార్తలొచ్చాయి. ఈ క్రమంలోనే ఆమెను కోర్టు ముందు హాజరుపరచగా.. ఆమెను 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడం జరిగింది.

# కేటీఆర్‌కు అవినీతి నిరోధకశాఖ నోటీసులు



భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ కు ఏసిబి అధికారులు నోటీసులు జారీ చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ- కేసులో ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, నెలాఖరులో యూకే, అమెరికా పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున.. తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని కేటీఆర్ బదులిచ్చారు.

"రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు కోసం తహతహలాడుతున్నారు. 48 గంటల క్రితం ఈడీ ఛార్జ్‌షీట్‌లో రేవంత్ పేరు వచ్చింది. అందుకే ఆయన కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. నోటీసులపై ఏసీబీకి లిఖిత పూర్వక సమాచారమిచ్చినట్లు ఆయన తెలిపారు.

# మనోడు ఎవడో... వెన్నపోటు పొడిచేదెవరో తెలిసింది.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఆవేశంతో కాదు బాధతో చెప్తున్నానని ఈ పది మంది ఎమ్మెల్యేలకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

50 ఏళ్లు అధికారం ఇస్తే కనీసం మంచినీళ్లు ఇవ్వలేదు, కడుపునిండా బువ్వపెట్టని కాంగ్రెస్ పార్టీని ఎవరైనా నమ్ముతారా అని అనుకున్నాం. కానీ కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీని నమ్మి బొక్కబోర్లా పడ్డారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మనందరి నినాదం నీళ్లు, నిధులు, నియామకాలు అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆ నినాదం మారిపోయిందని బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలుగా మారిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి మాటలను వింటుంటే ఆయన మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. చార్మినార్ ను రాచరికపు ఆనవాళ్లు అన్న రేవంత్ రెడ్డి.. ప్రపంచ సుందరాంగులను అక్కడికే తీసుకెళ్లి ఫోటో షూట్ చేయించారని సెటైర్ వేశారు.

# చంద్రబాబు చేతిలో సీఎం రేవంత్ ఓ కీలుబొమ్మ.. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సెటైర్లు

తెలంగాణ రాష్ట్రంలో దొంగలు పడ్డారని.. ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సీఎం, మంత్రులు ఎవరి దోపిడీ వాళ్లదేనని అన్నారు. ఐకేపీ కేంద్రాల్లోనే వడ్లు ముక్కి మొలకలొచ్చేస్తున్నాయని.. 60 రోజులైనా వడ్లు కొనలేదంటే ఇంతకంటే దారుణం ఉంటుందా అని మండిపడ్డారు. ఐకేపీ కేంద్రాల్లో రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూర్ గ్రామం ఐకేపీ సెంటర్‌లో తడిసి మొలకెత్తిన వడ్లను మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. రుతుపవనాలు వచ్చి దుక్కి దున్నాల్సిన రైతులు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందని అన్నారు. వడ్లు కొనే దిక్కు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంటాలైన తర్వాత మిల్లుల్లో రైతులతో బేరాలు జరుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజులకొకసారి వచ్చే లారీల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందని.. చివరికి రైతులు దళారుల కాళ్లు పట్టుకునే దుస్థితి దాపురించింది అన్నారు.పంట పండించేందుకు కష్టపడ్డ రైతు.. వడ్లు అమ్ముకునేందుకు మరింత కష్టపడుతున్నాడని జగదీశ్ రెడ్డి అన్నారు. అన్నిరంగాలతో పాటు రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అన్యాయం చేసిందని ఆరోపించారు. ఐకేపీ కేంద్రాల్లో గింజలేకుండా ప్రభుత్వం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు చేతిలో రేవంత్ రెడ్డి కీలుబొమ్మ అని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చంద్రబాబు ఆడించినట్లుగా రేవంత్ రెడ్డి ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నదులు మళ్లీ దోపిడీకి గురవుతున్నాయని అన్నారు. రేవంత్ కేసుల భయంతో ప్రధాని మోదీ కాళ్లు మొక్కే పనిలో ఉన్నాడని విమర్శించారు. మన సంపద ఆంధ్రకు దోచిపెట్టే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికే కృష్ణా నది దోపిడీ అయిపోయిందని.. బనకచర్లతో గోదావరి దోపిడీకి మరో కుట్ర జరుగుతుందని అన్నారు. బనకచర్ల ద్వారా గోదావరి జలాలు దోపిడీ జరుగుతున్నా రేవంత్ రెడ్డి మొద్దు నిద్రపోతున్నాడని విమర్శించారు. బీజేపీ , టీడీపీ , కాంగ్రెస్ కలిసి తెలంగాణా నీటిని దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు.

కేసుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుంటే.. మంత్రులు చంద్రబాబుతో పైరవీలు చేయిస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కమీషన్ల పనిలో ఉంటే.. చంద్రబాబు తెలంగాణ నీళ్లను దోచుకుంటున్నాడని ఆరోపించారు. కండ్ల ముందు తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. మన నీళ్లు మనకు వాడలేని నీచస్థితిలో ఇక్కడి మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉన్నారని విమర్శించారు. పాలన చేతగాకపోతే క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని హితవుపలికారు.

# ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు..? హరీష్ రావు


హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న మిస్ వరల్డ్ పోటీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. అందాల పోటీల కోసం రూ.200 కోట్లు ఖర్చు పెట్టారు.. కానీ రైతులకు విత్తనాలు ఇవ్వడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ కోసం రూ.4వేల కోట్లు ఖర్చు పెడుతారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులు చెల్లిస్తారు. కానీ రైతులకు మాత్రం రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకుల గ్రామంలో పండగ సాయన్న, కొరివి కృష్ణ స్వామి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావు మాట్లాడుతూ.. విగ్రహాల ఆవిష్కరించడమే కాకుండా.. ఆ మహానీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

పండగ సాయన్న పేదల కోసం పోరాడి ప్రాణం వదిలారని.. కానిస్టేబుల్ కిష్టయ్య తెలంగాణ కోసం తుపాకీ?తో కాల్చుకొని మరణించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో చెరువులకు నీళ్ళు ఇచ్చి ముదిరాజ్?లకి ఉపాధి కల్పించామని.. తద్వారా రాష్ట్రంలో చేపల పెంపకం బాగా పెరిగిందన్నారు. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్ట్?లను పట్టించుకోలేదన్నారు. వేయి కోట్లతో కేసీఆర్ ముదిరాజ్ ఆదుకున్నారని చెప్పారు.

కాంగ్రెస్ వచ్చాక సగం జిల్లాల్లో చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పోయలేదని.. ఇప్పటి వరకు చేపల పెంపకం కోసం టెండర్లు కూడా పిలవడం లేదన్నారు. ముదిరాజ్?లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ ఏడాది అన్ని చెరువుల్లో చేప పిల్లలు పోయాలని.. లేదంటే కాంగ్రెస్ సర్కార్ ను వదిలేదే లేదని హెచ్చరించారు.

# తెలంగాణను నంబర్ వన్ స్థానానికి తీసుకొస్తాం: భట్టి విక్రమార్క



దేశంలో తెలంగాణను మొదటిస్థానానికి తీసుకెళ్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశం, ప్రపంచం తెలంగాణ వైపు చూస్తున్నాయని చెప్పారు. కులగణన చేసిన తీరును రాష్ట్రాలు తెలుసుకుంటున్నాయని అన్నారు. భట్టి విక్రమార్క నాగర్‌కర్నూల్ జిల్లాలోని పోల్కంపల్లి, బొమ్మంపల్లి, పదర సబ్‌స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దెయ్యాలను వదిలించుకుని తమకు గెలిపించారని చెప్పారు.

దెయ్యాలకు నాయకత్వం వహించే వ్యక్తి దేవుడా అంటూ కేసీఆర్‌పై సెటైర్ వేశారు. పాలమూరు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, పాలమూరు ప్రాజెక్టులు వేగంగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ గిరిజనుల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. భూమి లేని నిరుపేదలకు తమ ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలని భావిస్తున్నట్టు చెప్పారు. విద్యా వ్యవస్థను కూడా గాడిలో పెడుతున్నామని వెల్లడించారు.

# నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం

మొదటి పేజీ తరువాయి

దేశ అభివృద్ధి పథంలో ముందడుగు

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రకటించిన అనంతరం, ప్రధాని మోడీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటన నిర్వహిస్తున్నారు. రూ.77 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వడోదర, భుజ్, అహ్మదాబాద్ తదితర నగరాల్లో రోడ్ షోలు నిర్వహించి ప్రజలకు అభివృద్ధి సంకల్పాన్ని వివరించారు.

దాహోద్‌లో ఏర్పాటు చేసిన రూ.21 వేల కోట్ల విలువైన రైల్వే ఉత్పత్తి యూనిట్‌ను మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "భారత అభివృద్ధి పథంలో వెనుకబడిన ప్రాంతాలను ముందుకు తీసుకురావడమే మా లక్ష్యం," అన్నారు. పండుగ సమయంలో 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను కోరారు.

భారతీయుల శక్తిని నిరూపించిన ఘట్టం

మోడీ మాట్లాడుతూ, "ఏప్రిల్ 22న ఉగ్రవాదులు మనపై చేసిన దాడికి మేము మే 6న 22 నిమిషాల్లోనే సమాధానం ఇచ్చాము. ఇది 140 కోట్ల మంది భారతీయుల గర్వాన్ని నిలబెట్టిన ఘట్టం," అన్నారు.

ఇది ఒక సైనిక చర్యే కాదు, భారతీయుల భావోద్వేగాలకు ఇచ్చిన సమాధానమని ఆయన స్పష్టం చేశారు.

# ఆమె ఐఏఎస్ అధికారినా లేక పాకిస్తానీనా.? వివాదంగా బీజేపీ నేత కామెంట్స్..

మొదటి పేజీ తరువాయి

అయితే, రవికుమార్ వ్యాఖ్యల గురించి మీడియా ప్రశ్నించిన నేపథ్యంలో, ఈ వ్యాఖ్యల గురించి తనకు తెలియదని నారాయణ స్వామి అన్నారు.

మే 21న, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేని కుక్కతో పోల్చారని ఆరోపిస్తూ, నారాయణ స్వామి బస చేసిన కలబురిగిలోని చిత్తాపూర్ గెస్ట్ హౌజ్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు చుట్టుముట్టారు. ఈ ఘటనను ప్రస్తావిస్తూ రవికుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. "దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి నాయకులను, వారు చేసే ప్రసంగాలను చూస్తే, అది తీవ్ర కలతపెట్టే మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. గౌరవనీయమైన అధికారిపై ఇటువంటి ఆరోపణలు చేయడం ఆమోదయోగ్యం కాదు" అని అన్నారు. "తమ తోటి పౌరుల గురించి ఇలా మాట్లాడే వారిని మనం నిజమైన భారతీయులు అని కూడా పిలవగలమా? అతనే సంఘ విద్రోహి" అని విమర్శించారు.

పాకిస్తాన్‌పై భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ప్రెస్ బ్రీఫింగ్ ఇచ్చిన కల్నల్ సోఫియా ఖురేషిపై బీజేపీ నేత, మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా వివాదాస్పద వ్యాఖ్యలు ఇటీవల దేశవ్యాప్త ఆగ్రహానికి కారణమయ్యాయి. దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టు, సుప్రీంకోర్టు మంత్రిని తీవ్రంగా మందలించాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకోవడానికి అదే కమ్యూనిటీకి చెందిన సోదరిని ప్రధాని మోడీ పంపారని విజయ్ షా చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి.

# దాడులపై 30 నిమిషాల్లోనే పాకిస్తాన్‌కి సమాచారం అందింది: జైశంకర్




పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత్, పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని "ఆపరేషన్ సిందూర్" ప్రారంభించింది. మొత్తం 09 లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, భారతదేశం ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత 30 నిమిషాల్లోనే పాకిస్తాన్ అప్రమత్తమైందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీకి తెలియజేసినట్లు తెలిసింది. మే 07 రాత్రి ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.

" ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన అరగంటలోపు, ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పాకిస్తాన్‌కి సమాచారం ఇచ్చాం. భారతదేశం, పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ల మధ్య ప్రత్యక్ష సంభాషణ తర్వాత రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ముందుగా పాకిస్తాన్ ఈ ప్రతిపాదన చేసింది" అని జైశంకర్ చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఆపరేషన్ సిందూర్ మరియు పాకిస్తాన్ నుండి ఉద్భవించే సీమాంతర ఉగ్రవాదం గురించి చర్చించడానికి ఎస్ జైశంకర్ అధ్యక్షత వహించిన విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కెసి వేణుగోపాల్, మనీష్ తివారీ, ముకుల్ వాస్నిక్, ప్రియాంక చతుర్వేది, అప్రజిత సారంగి, గుర్జిత్ ఆజ్లా వంటి ఎంపీలు పాల్గొన్నారు. భారతదేశం ఖచ్చితత్వంతో వ్యవహరించిందని, ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని, పరిస్థితి తీవ్రతరం కాకుండా ఉండటానికి పాకిస్తాన్‌కు వెంటనే ఈ విషయాన్ని తెలియజేసిందని జైశంకర్ సభ్యులకు చెప్పినట్లు తెలిసింది. పాకిస్తాన్ పెద్ద ఎత్తున ప్రతీకారం తీర్చుకోవచ్చని అమెరికా విదేశాంగ కార్యదర్శి నిఘా వర్గాలకు సమాచారం అందించినప్పుడు భారత్ తీవ్రంగా స్పందించిందని జైశంకర్ చెప్పారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్ కొత్త కాదు.. 1952-67 వరకు ఒకేసారి ఎన్నికలు..!



వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనేది.. దేశానికి, తమిళనాడుకు కొత్తదేమీ కాదు అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన ధినేత పవన్ కల్యాణ్.. చెన్నైలో జరిగిన వన్ నేషన్ - వన్ ఎలక్షన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1952-67 వరకు దేశంలో ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి..వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనేది కోరుకున్నది మాజీ సీఎం దివంగత కరుణానిధి .. ఇప్పుడు వారి కూమారుడు స్టాలిన్ వద్దు అంటున్నారు అని మండిపడ్డారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ల వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగదు అన్నారు పవన్ కల్యాణ్.. అందుకు ఉదాహరణే గత రెండు ఎన్నికలలో ఏపీ, తెలంగాణ ప్రాంతీయ పార్టీ గెలుస్తున్నాయి. తెలంగాణలో టీఆర్ఎస్ వరుసగా రెండు సార్లు గెలిచింది.. ఏపీలో 2014 టీడీపీ, 2019లో మరో పార్టీ గెలిచింది.. గత ఎన్నికలలో కూటమీ ప్రభుత్వం ఎంపీ, అసెంబ్లీలో ఎన్నికలలో గెలిచింది.. ఆ గెలుపు ప్రాంతీయ పార్టీలే కీలకంగా ఉన్నాయి అని గుర్తుచేశారు.. ఒడిస్సా, తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి..అక్కడ బీజేపీ లబ్ధి పొందలేదు.. ఆశించినంత గెలవలేదు కదా..? అని ప్రశ్నించారు. కానీ, ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందని డీఎంకే చెప్పడం విడ్డురంగా ఉందన్నారు..ఇక, వన్ నేషన్ ,వన్ ఎలక్షన్ పై కరుణానిధి పుస్తకంలో రాశారు..డీఎంకే అధినేత స్టాలిన్ ఒకసారి వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై పునరాలోచించుకోవాలని సూచించారు.. నేను దక్షిణాదినేతనే..నేను ప్రాంతీయ పార్టీ అధ్యక్షుడు నే..అంతిమంగా ప్రజలకు ఏది మంచి జరుగుతుందో ఆ దిశగానే ఆలోచించాలి.. వ్యక్తిగత లబ్ధి కోసం ఆలోచించకూడదు.. ఈ వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనేది కరుణానిధి కళ..ఆయన డ్రీమ్ అది..దేశంలో ఎప్పుడూ ఎక్కడో ఒకచోటా ఎన్నికల జరగడం వల్ల ఇబ్బందులు పడాల్సివస్తోంది..దానివల్ల డబ్బులు, టైం, అభివృద్ధి పై ఎఫెక్ట్ పడుతుంది.. వాటి అన్నిటికి చెక్ పెట్టడానికే వన్ నేషన్, వన్ ఎలక్షన్.. ఎప్పుడు ఎలక్షన్లో ఉండడంవల్ల అధికారులు నేతలు దానిపైనే దృష్టి పెడుతున్నారు..దానివల్ల అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు..

# తెలంగాణ గానకోకిల బెల్లి లలితక్క 26వ వర్ధంతి ఘన నివాళులు



మోత్కూర్ 26మే (క్రాంతి న్యూస్) : మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆటపాటలతో తెలంగాణ భావజాలాన్నీ ఊరురా వ్యాప్తి చేసి ప్రజలని చైతన్య పరచి,తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ప్రాణాలు అర్పించిన లేడి గద్దర్ గా మరియు తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత 26వ వర్ధంతి సందర్భంగా బెల్లి లలిత కుమారుడైన శ్రీరామ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి మరియు గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి కారుపోతుల వెంకన్న గౌడ్ మాజీ కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, బొడ్డుపెల్లి కళ్యాణ్ చక్రవర్తి మార్కెట్ డైరెక్టర్లు యండి . సమీరుద్దీన్,పన్నాల శ్రీనివాస్ రెడ్డి మైనార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యండి .అయ్యాజ్, యండి .షాకీర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మెంట నాగేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్ ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు నిమ్మల శ్రీను మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, లింగయ్య,రాములు మైనార్టీ టౌన్ అధ్యక్షుడు యండి .బాబర్, అవిశెట్టి మధు,ఆలకుంట్ల నరసింహ,వెంకన్న,వెంకట్ రెడ్డి, మంటి పెల్లి నరేష్,శివ, తొట్ల సాయి,మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నాకు వందలాదిగా తరలి రండి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి**

మోత్కూర్ 26మే (క్రాంతి న్యూస్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మోత్కూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పాటిమట్ల ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం యాదగిరి పాల్గొని. మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వారం వారం డబ్బులు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. పేరుకు ప్రభుత్వము రోజు కూలీ 307 రూపాయలు నిర్ణయించిన 150 నుండి 230 రూపాయలు దాటడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా కొలతలతో సంబంధం లేకుండా నిర్ణయించిన రేటు కాకుండా రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 6 కోట్ల పని దినాలు



అవసరము ఉంటే మోడీ ప్రభుత్వం 3 కోట్ల పని దినాలు మంజూరు చేస్తే మరి మిగతా రోజులు కార్మికులు ఏమి పని చేయాలని యాదగిరి ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వము సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీలు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను, ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు. పని ప్రదేశంలో తాగడానికి నీళ్లు, నీడ కోసం టెంట్, పని ప్రదేశంలో గాయపడితే చికిత్స అందించడానికి మెడికల్ కిట్టు తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి పని కల్పించాలని, నూతన జాబులు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడితే రోజు కూలీ కట్టి ఇవ్వాలని, చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వాచర్నును, మెట్లను గుర్తించి అర్హత కలిగిన వారందరికీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని వీటి సాధన కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఇంకా ఈ కార్యక్రమంలో కార్మికులు పోషమ్మ, అంజమ్మ , మల్లమ్మ, శ్రీదేవి, లింగమ్మ, ఈశ్వరమ్మ, మల్లయ్య, శోభా తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.. కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డిమాండ్

సిద్దిపేట ,26 మే (క్రాంతి న్యూస్ ): కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను




నెరవేర్చాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి కూడా సిద్ధమని ప్రకటించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకులలో పండగ సాయన్న ముదిరాజ్, కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకుని గుర్తించుకుంటున్నామని అన్నారు. మన ప్రముఖుల చరిత్రలు బయటకు వస్తున్నాయని తెలిపారు. కృష్ణ స్వామి విగ్రహాలను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో నలుమూలల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన చరిత్ర చాలా గొప్పదని.. బలహీన వర్గాల కోసం ఆయన గ్రంథాల్ని రచించారని.. ఆయన ఆనాటి నిజాం కాలంలోనే గుర్తింపబడ్డారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డ1956 తర్వాత మొదటి మేయర్ కృష్ణ స్వామి అని హరీశ్‌రావు తెలిపారు. ఆయన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేశారని అన్నారు. పండగ సాయన్న భూస్వాములకి వ్యతిరేకంగా పోరాటం చేశాడని తెలిపారు. పెద్దొన్ని కొట్టు పేదలకు పెట్టాలనే నినాదంతో ఆయన పని చేశాడని పేర్కొన్నారు. ఆ కాలంలో పండగ సాయన్న అంటేనే హడల్ అని అన్నారు. పండగ సాయన్న సమాజ శ్రేయస్సు కోసం పనిచేశాడని చెప్పారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేవల్ కిషన్ జాతరను అధికారికంగా ప్రకటించి నిధులు విడుదల చేశారని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వే వల్ల మన ముదిరాజ్ అధిక సంఖ్యలో ఉన్నారని తెలిసిందని అన్నారు. కేసీఆర్ హయాంలోనే మత్స్యకారులకు వాహనాలు పంపిణీ చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

# మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకి అప్పగించండి





తెలంగాణ,26 మే (క్రాంతి న్యూస్ ): ఛత్తీస్‌గఢ్‌లో మే 21వ తేదీన జరిగిన ఎన్ కౌంటరులో చనిపోయిన మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు సహా మిగతా మావోయిస్టులందరి మృతదేహాలను వారి బంధువులకు అప్పజెప్పాలని పీస్ కమిటీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మృతదేహాల అన్నింటిని వారి కుటుంబాలకు వెంటనే అందజేయాలన్నారు. మృతుల గౌరవానికి సంబంధించిన రాజ్యాంగ, న్యాయపరమైన, అంతర్జాతీయ బాధ్యతలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. ఇక, పీస్ కో ఆర్డినేషన్ కమిటీ తరఫున ప్రొ.హరగోపాల్, ప్రొ.జి లక్ష్మణ్, డా. ఎం.ఎఫ్. గోపినాథ్, కవితా శ్రీవాత్సవ, క్రాంతి చైతన్య, మీనా కందసామి ఈ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

అయితే, మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసిన తర్వాత వారి కుటుంబీకులకు అప్పగిస్తామని ఛత్తీస్ గఢ్ అడ్వకేట్ జనరల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందు హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు వాటిని అప్పగించలేదని ఇది ఆందోళనకరం అని పీస్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మృతదేహాలతో గౌరవప్రదంగా వ్యవహరిచాలనే హక్కు ఉల్లంఘిస్తున్నారు.. గౌరవంగా భద్రపరచాలనే స్పష్టమైన చట్టపరమైన బాధ్యత ఉన్నప్పటికీ వాటిని కోల్డ్ స్టోరేజ్ లో భద్ర పర్చకుండా కుళ్లిపోయేలా వదిలేశారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తోందని పీస్ కమిటీ పేర్కొంది.

ఇలా వ్యవహరించడం వైద్య, చట్టపరమైన ప్రోటోకాల్ ను తీవ్రంగా ఉల్లంఘించడమేనని పీస్ కమిటీ పేర్కొనింది. అయితే, మరణించిన వ్యక్తితో అమానవీయంగా వ్యవహరించడం, విషాదంలో ఉన్న కుటుంబాలకు మరింత మానసిక ఆందోళనను కలిగించడమేనని ఆరోపించింది. అంత్యక్రియల ఊరేగింపుల వల్ల శాంతిభద్రతల సమస్య వస్తుందని పేర్కొంటూ ఇద్దరి మృతదేహాలను అప్పగించడాన్ని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించడం మాకు చాలా బాధ కలిగించిందని అన్నారు. సంతాపాన్ని నేరంగా పరిగణించే ఈ సమర్థన దుర్మార్గమైనదని.. రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలిపారు. అంతిమ సంస్కారాలు చేయడానికి తాము ఎలాంటి షరతులకైనా కట్టుబడి ఉండటానికి రెడీగా ఉన్నానమని మరణించిన మావోయిస్టు కుటుంబాలు కోర్టుకు తెలిపినా.. ఇంకా మృతదేహాలను వారికి అప్పగించకపోవడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పీస్ కమిటీ వెల్లడించింది.

# తెలంగాణలో వాతావరణ పరిస్థితిపై ఐఎండీ ప్రకటన

హైదరాబాద్,26 మే (క్రాంతి న్యూస్ ): రుతుపవనాల రాకతో తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై భారత వాతావరణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కుమరం భీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో సోమవారం రాత్రి 7 గంటల వరకు వర్షం కురిసే అవకాశమున్నట్లు ఐఎండీ పేర్కొంది.



హైదరాబాద్‌లో వర్షం

ఉపరితల ద్రోణి కారణంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది.

# ఢిల్లీ లో తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సభ



ఢిల్లీ,26 మే (క్రాంతి న్యూస్ ): : తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సభ ఢిల్లీలో జరిగింది. కులగణనపై రాహుల్ గాంధీకి అభినందనలు తెలుపుతూ ఈ సభను నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన కులగణనను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు హాజరయ్యారు.

# కాకాణికి రిమాండ్.. జైలుకు తరలింపు..



నెల్లూరు ,26 మే (క్రాంతి న్యూస్ ): మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి రిమాండ్ విధించింది కోర్టు.. కాకాణిని వెంకటగిరి మేజిస్టేట్ ముందు హాజరుపరిచారు పోలీసులు.. ఈ నేపథ్యంలో వెంకటగిరిలో అప్రమత్తమైన పోలీసులు.. వెంకటగిరి కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు గూడూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం, అభ్యంతరం వ్యక్తం చేసిన గిరిజనులపై బెదిరింపులకు దిగడం లాంటి తదితర అభియోగాలపై నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. దాదాపు 55 రోజులుగా పరారీలో ఉన్న కాకాణిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి వచ్చేనెల తొమ్మిది వరకు రిమాండ్ విధించారు న్యాయమూర్తి.. దీంతో, వెంకటగిరి నుంచి నెల్లూరు సెంట్రల్ జైలుకి కాకాణిని తరలించారు పోలీసులు.

# వల్లభనేని వంశీకి షాకిచ్చిన కోర్టు..!






నూజివీడు ,26 మే (క్రాంతి న్యూస్ ): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు మరోసారి కోర్టులో షాక్ తగిలినట్టు అయ్యింది.. తాజాగా, నూజివీడు కోర్టులో వల్లభనేని వంశీకి చుక్కెదురైంది. వంశీ మోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది నూజివీడు కోర్టు..నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వల్లభనేని వంశీ.. అయితే, దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. వంశీ ప్రస్తుతం ఇదే కేసులో అరెస్టై విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం విదితమే..

కాగా, ఇప్పటికే పలు కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ పొందారు వల్లభనేని వంశీ.. కానీ, చివరల్లో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో కోర్టు వల్లభనేని వంశీపై పీటీ వారెంట్‌కు అనుమతి ఇవ్వడంతో కథ అడ్డం దిరిగింది.. ఇక, నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న వల్లభనేని వంశీ పలుమార్లు అస్వస్థతకు గురయ్యారు.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన్ను పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తుండగా.. ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు.. మరోవైపు.. ఈ విషయం తెలుసుకుని జీజీహెచ్‌కు చేరుకున్న వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీని.. వంశీని కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు.. దీంతో, ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగిన విషయం విదితమే..

# మహానాడులో తీర్మానం చేసే దమ్ము టీడీపీకి నేతలకు ఉందా?..

## ఆర్కే రోజా కీలక వ్యాఖ్యలు!



తిరుపతి,26 మే (క్రాంతి న్యూస్ ): కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడే వాళ్లు ఇక్కడ ఎవరూ లేరని మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. రోజుకొకరిపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటుందో చూపిస్తామని రోజా చెప్పుకొచ్చారు.

తిరుపతిలో మాజీ మంత్రి ఆర్కే రోజా మీడియాతో మాట్లాడుతూ..'ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారు. రోజుకొకరిపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుంది. ఏడాదిలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని మహానాడులో తీర్మానం చేసే దమ్ము టీడీపీకి నేతలకు ఉందా?. ఏ హామీలు అమలు చేశారని మహానాడు నిర్వహిస్తున్నారో టీడీపీ నేతలు సమాధానం చెప్పాలి. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, కాకాణిపై కేసులు అక్రమంగా పెట్టారు. అక్రమ కేసులకు భయపడే వారు ఇక్కడ ఎవరూ లేరు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటుందో చూపిస్తాం. లిక్కర్ స్కామ్ అనేది ఒక పెద్ద అబద్ధం. స్కామ్ జరగలేదు, టీడీపీ మాత్రం స్కామ్ జరిగిందంటూ కేసులు పెట్టి వేధిస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక లిక్కర్, ఇతర స్కామ్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని మండిపడ్డారు.

# పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. వైసీపీ నేతల హెచ్చరిక!

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడంపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకాణికి హాని తలపెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అరెస్ట్‌లతో వైసీపీని అణగదొక్కాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్షంపై కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాకాణిని అదుపులోకి తీసుకోవడంపై నెల్లూరు జిల్లా పోలీసులు అధికారిక ప్రకటన చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం తదితర అభియోగాలపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసు స్టేషన్‌లో కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదయింది. ఈ కేసులో నాలుగో నిందితుడి (ఏ4)గా ఉన్నారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు పలుమార్లు నోటీసులిచ్చినా.. కాకాణి వాటిని బేఖాతరు చేశారు. అరెస్టు తప్పదని గ్రహించిన తర్వాత అజ్ఞాతంలో ఉండి.. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసిన నిరాశ తప్పలేదు. గత రెండు నెలలుగా పరారీలో ఉన్న కాకాణి.. తమిళనాడు,



కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌లోని పలుచోట్ల తలదాచుకున్నారు. చివరకు బెంగళూరు సమీపంలోని ఓ పల్లెటూరిలోని రిసార్ట్‌లో ఉన్నట్లు తెలుసుకున్నా పోలీసులు ఆదివారం సాయంత్రం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

కాకాణి గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడంపై వైసీపీ నేతల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు మాజీ మంత్రి అనిల్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరీగా మురళి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకాణి అరెస్ట్‌పై వైసీపీ నేతల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాజీ మంత్రి కాకాణిని హాని తలపెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అరెస్ట్‌లతో వైసీపీని అణగదొక్కాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు. కుట్రలతో నిరాధారమైన కేసులు పెడుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్షంపై కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోంది. కాకాణికి జిల్లా పార్టీ అండగా ఉంటుంది. కాకాణిని అదుపులోకి తీసుకోవడంపై జిల్లా పోలీస్ ప్రకటన చేయాలి' అని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

# రాయలసీమలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

ఏపీ,26 మే (క్రాంతి న్యూస్ ): ఈసారి రుతుపవనాలు ముందుగానే వచ్చాయి . ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. కాగా సోమవారం రాయలసీమ ప్రాంతాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. మిగతా



ప్రాంతాలకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. గత ఏడాది 2024లో జూన్ 2న రుతుపవనాలు ఏపీలో ప్రవేశించాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు.

కాగా నైరుతి రుతుపవనాలు ఆదివారం మహారాష్ట్రలోకి ప్రవేశించాయి. అరేబియా సముద్రంలో అనేక ప్రాంతాలు, కర్ణాటకలో పలు ప్రాంతాలు, వీటికి ఆనుకొని ఉన్న మహారాష్ట్రలో కొంత భాగం, బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతంలో మణిపూర్, నాగాలాండ్‌లో పలు ప్రాంతాల వరకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఏపీలో కొన్ని భాగాలు, తమిళనాడులో మిగిలిన భాగాలు, ఈశాన్య భారతంలో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఆదివారం నాటికి మధ్య మహారాష్ట్రలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడిన తర్వాత దాని అవశేషాలు (ఉపరితల ఆవర్తనం) తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమమధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ అల్పపీడనంగా మారుతుందని పలు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఇది తర్వాత బలపడి ఉత్తర వాయువ్యంగా ఉత్తర ఒడిశా వైపు పయనించనుంది. దీనివల్ల రుతుపవనాలు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీ, దానికి ఆనుకుని ఒడిశా పరిసరాల వరకు విస్తరించనున్నాయని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**కోస్తాలో భారీ వర్షాలు!**

అరేబియా సముద్రం నుంచి మధ్యమహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులతో వర్షాలు కురిశాయి. మరోవైపు రోహిణి కార్తె ప్రవేశించిన నేపథ్యంలో ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల ఉక్కపోత కొనసాగింది.

కాగా జూన్‌లో రావాల్సిన రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించినట్లు ఐఎండీ ప్రకటించింది. అధికారులు చెప్పిన ప్రకారం నైరుతి రుతుపవనాలు శనివారం కేరళలో ప్రవేశించాయి. సాధారణ తేదీ కంటే ఎనిమిది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయని అధికారులు పేర్కొన్నారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించాయని అన్నారు.

# పెన్నా నదిలో బయటపడిన పురాతన అమ్మవారి విగ్రహం

నెల్లూరు ,26 మే (క్రాంతి న్యూస్ ):నెల్లూరు జిల్లా జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో అక్కడ ఉన్న పెన్నానదిలో అరుదైన ఘటన చోటు చేసుకుంది.



అమ్మవారి దేవాలయం సమీపంలో నదిలో అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో ఇంకేముంది అక్కడ భక్తులు బారులు తీరారు. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే....నెల్లూరు జిల్లాలో కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే నదిలో అమ్మవారి విగ్రహం బయటపడటంతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చి.. శక్తి స్వరూపినిగా ఉన్న అమ్మవారి రూపాన్ని చూసి పూజలు నిర్వహిస్తున్నారు. విగ్రహాన్ని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భక్తుల కోలాహలం మధ్య అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. జొన్నవాడ గ్రామ వీధుల్లో రథం లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఇదిలా ఉండగా.. గత ఏడాది సెప్టెంబర్ నెలలో అల్లూరి జిల్లాలో బంగారు వర్ణపు విగ్రహం వాగు ఉధృతిలో కొట్టుకువచ్చింది. ఇసుక మేటలో భక్తులకు అభయం ఇస్తున్నట్లుగా నిలబడి ఉన్న స్వామి విగ్రహాన్ని చూసిన భక్తులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ప్రస్తుతం జొన్నవాడలో బయటపడిన అమ్మవారి విగ్రహం ఎక్కడి నుంచైనా కొట్టుకువచ్చిందా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది.

# ఏరోజూ సినిమా నిర్మాతల్ని ఇబ్బంది పెట్టలేదు.. మంత్రి కందుల దుర్గేష్ కీలక వ్యాఖ్యలు!



అమరావతి,26 మే (క్రాంతి న్యూస్ ): మమ్మల్ని కలవ లేదని ఏరోజూ తెలుగు సినిమా నిర్మాతల్ని తాము ఇబ్బంది పెట్టలేదని ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సినీ ప్రముఖులు కలవలేదని తాము ఎప్పుడైనా పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నామా? అని ప్రశ్నించారు. హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ ముందు ప్రపంచంలో థియేటర్లో బంధు అనే విషయం ఎందుకు బయటకు వచ్చిందన్నారు. సినిమాల విషయంలో పవన్ కళ్యాణ్ మాట్లాడింది స్పష్టమైన వైఖరి అని పేర్కొన్నారు. సినిమా విషయాలపై పరిజ్ఞానం లేని వారు మాట్లాడుతున్నారని మంత్రి కందుల దుర్గేష్ ఫైర్ అయ్యారు.

ఏపీ రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి, సినీ రంగానికి సంబంధించి ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాల గురించి మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. రాజమహేంద్రవరంలో ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల విషయంలో పవన్ కళ్యాణ్ మాట్లాడింది స్పష్టమైంది. త్వరలో సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన కొత్త పాలసీ తీసుకురాబోతున్నాం. సినిమా ఇండస్ట్రీ వారితో చర్చించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. సినిమా పరిశ్రమకు ఏపీ ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది. కొందరి మాటలు అహంభావపూరితంగా ఉన్నాయి. ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్లు పెంచమని వస్తున్నారు, మేం ఓకే చేస్తున్నాం. ఆ వెంటనే ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారు. అధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అయినా మేం సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం మేం రేట్లు పెంపునకు అనుమతిస్తున్నాం' అని అన్నారు.

'తెలుగు సినిమా పెద్దలు ఏపీ ప్రభుత్వాన్ని కలుస్తారా లేదా అనేది వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నాం. మమ్మల్ని కలవలేదని ఏరోజూ తెలుగు సినిమా నిర్మాతల్ని ఇబ్బంది పెట్టలేదు. సినిమా టికెట్ల రేట్లకు సంబంధించి శాశ్వత విధానాన్ని ఏపీ ప్రభుత్వం రూపొందించబోతుంది. హరిహర వీరమల్లు విడుదలకు ముందే బంద్ అనే అంశం ఎందుకు తెరపైకి వచ్చింది. బంద్ అనే విషయం ముందే తెలిసినా ఫిల్మ్ ఛాంబర్ ఎందుకు స్పందించలేదు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ముందుగానే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఏపీ ప్రభుత్వాన్ని కలవాల్సిందని నిర్మాత అల్లు అరవింద్ ఇప్పుడు చెప్పడం హర్షణీయం. ఈ వ్యవహారం నుంచి వైసీపీ లబ్ధి పొందాలని చూస్తుంది' అని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# రహదారి విస్తరణ పనులు ప్రారంభం



నగరంలో పలు రహదారుల విస్తరణ పనులు ప్రణాళిక విభాగం అధికారులు ప్రారంభించారు. నగరంలోని మిషన్ రోడ్, చెక్క బజార్ నుంచి ముత్యాలమ్మ గుడి వరకు రహదారి విస్తరణ చేపడుతున్నట్టు ఏసీపీ వసుంధర తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించి మార్కింగ్ చేశామన్నారు. వ్యాపారులతో చర్చించి మరికొన్ని పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ముందుగా నగరపాలక సంస్థకు చెందిన వ్యాపార సముదాయాలను కూల్చివేస్తున్నట్టు ఆమె వెల్లడించారు.

# మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు



ఢిల్లీ ,26 మే (క్రాంతి న్యూస్ ):కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి హస్తం పార్టీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే, సోమవారం ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లో ఓబీసీ ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హన్మంతరావు మాట్లాడుతూ.. త్వరలోనే రాహుల్ గాంధీకి ధన్యవాద సభ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భారత జోడో యాత్రలో రాహుల్ గాంధీ కీలక నిర్ణయం ప్రకటించాడు.. అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని అప్పుడే వెల్లడించారు.. అందులో భాగంగానే.. దేశంలోనే మొట్ట మొదట తెలంగాణలో కులగణన చేశామని వి. హన్మంతరావు తెలిపారు.

ఇక, రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతాయని మాజీ ఎంపీ వి. హన్మంతరావు పేర్కొన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో.. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి బీసీ నేతలను పిలిచి సమావేశం నిర్వహించారు.. అయితే, మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు అని ఆరోపించారు. ఓబీసీ ఎంపీల కన్వీనర్ గా మూడు సార్లు ప్రధానిని కలిశాను.. కులగణన చెయ్యాలని కోరాను.. కానీ, ఇప్పటి వరకు చేయలేదు.. త్వరలోనే కులగణన చేస్తామని చెప్పారని వీహెచ్ వెల్లడించారు.

# పారపట్టి మట్టి పనులు చేసిన మంత్రి




అమరావతి, మే 26: కడప జిల్లాలో తెలుగు దేశం పార్టీ మహానాడుకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి జరగబోయే టీడీపీ మహానాడుకు మంత్రులు కడపకు బయలుదేరి వెళ్తున్నారు. ఇప్పటికే చేరుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు మహానాడు ప్రాంగణం వద్ద స్వయంగా పనులు చేపట్టారు. పార పట్టుకుని మట్టి పనులు చేసిన మంత్రి.. తాను ఒక కార్యకర్తనే అనే విషయానే చెప్పకనే చెప్పారు. వర్షం వల్ల మహానాడు ప్రాంగణంలోకి నీళ్లు చేరాయి. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీర్‌గా ఉన్న మంత్రి నిమ్మల.. ఈ విషయాన్ని గమనించి స్వయంగా పార పట్టి సభా ప్రాంగణంలో మట్టిని చదును చేశారు. మరోవైపు మంత్రి సవిత కూడా సైకిల్‌పై మహానాడుకు బయలుదేరారు. పార్టీ కార్యకర్తలతో కలిసి సైకిల్ తొక్కుతూ బయలుదేరారు మంత్రి.

44 మంది తెలుగు దేశం కార్యకర్తలతో పెనుకొండ నుంచి కడపకు సైకిల్‌పై ర్యాలీగా పయనమయ్యారు. సత్యసాయి జిల్లా పెనుగొండ పట్టణంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి మంత్రి సవిత సైకిల్ యాత్రను ప్రారంభించారు. అనంతరం వైజంక్షన్ వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర మంత్రి సైకిల్ తొక్కారు. మరోవైపు కడప జిల్లాలో మహానాడు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈరోజు మంత్రి నారా లోకేష్ మహానాడు వద్దకు రానున్నారు. అంతేకాకుండా ఇప్పటికే మంత్రులు, టీడీపీ నేతలు కడపకు చేరుకున్నారు. రేపు కడప మహానాడుకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లనున్నారు. రేపటి నుంచి మూడు రోజుల మహానాడు జరుగనుంది. ఇందు కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. కడప జిల్లాలో తొలిసారి జరుగుతున్న మహానాడు కోసం నగరంలో భారీగా స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. రేపు ఉదయం ప్రతినిధుల నమోదుతో మహానాడు మొదలుకానుంది.

తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామవళిలో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది. ఆరు సూత్రాల్లో మొదటి రెండు సూత్రాలపై మొదటిరోజు చర్చ జరుగనుంది. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. అలాగే రెండో రోజు ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని నివాళు లర్పించనున్నారు. ఆరు సూత్రాల్లో మిగిలిన నాలుగు సూత్రాలపై చర్చించి, తీర్మానాలు చేయనున్నారు. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం తరువాత.. అధ్యక్షుడు ప్రసంగించనున్నారు. ఇక చివరి రోజు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు దాదాపు 5 లక్షల మంది రానున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# భారత దాడుల్లో పాక్ నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌కి భారీ నష్టం.. శాటిలైట్ చిత్రాలు..

క్రాంతి న్యూస్: ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌కి తీరని నష్టాన్ని మిగిల్చింది. పహల్గామ్ ఉగ్రవాద ఘటనకు తర్వాత, భారత్ దాయాది దేశంలోని ఉగ్రవాద స్థావరాలను టార్గెట్ చేసి ధ్వంసం చేసింది. అయితే, దీని తర్వాత పాక్ సైన్యం భారత్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులు నిర్వహించింది. ఈ దాడులకు ప్రతిగా భారత్ మే 10 తెల్లవారుజామున పాకిస్తాన్ వైమానిక స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. మొత్తం 11 ఎయిర్ బేస్‌లపై దాడులు చేసింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ వైమానిక దళం 20 శాతం ఆస్తుల్ని కోల్పోయినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే, తాజాగా శాటిలైట్ చిత్రాలను బట్టి చూస్తే.. పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ రావల్పిండికి సమీపంలో ఉన్న నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ దారుణంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ డ్రోన్స్, వీఐపీ ఎయిర్ ఫ్లీట్‌కి నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ కేంద్రంగా ఉంది. ఇది పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కి 25 కి.మీ లోపే ఉంది. భారత్ దాడి చేసిన ప్రదేశానికి సమీనంలోని మొత్తం కాంప్లెక్స్ ఇప్పుడు మొత్తం కూల్చివేయడినట్లు వెల్లడైంది.

ఈ వైమానిక స్థావరంలోని మౌలిక సదుపాయాలు, గ్రౌండ్ సపోర్ట్ వ్యవస్థలను లక్ష్యంగా




చేసుకుని భారత్ ఖచ్చితమైన దాడులు నిర్వహించిందని రక్షణ రంగ విశ్లేషకుడు డామియన్ సైమన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ స్థావరం పాకిస్తాన్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి దగ్గరగా ఉండటం, వైమానిక మొబిలిటీ కార్యకలాపాలకు కమాండ్ సెంటర్‌గా పనిచేస్తున్నందున, ఈ దాడిని వ్యూహాత్మకంగా, ప్రతీకాత్మకంగా చూశారు. ఈ స్థావరంలో ఎయిర్ బోర్న్ వార్నింగ్ సిస్టమ్ సాబ్ ఎరియే వ్యవస్థతో పాటు, సి -130 రవాణా విమానాలు,ఐఎల్ -78 మిడ్-ఎయిర్ రీఫ్యూయలింగ్ విమానాలు ఉన్నాయి.

ఈ స్థావరంలో టర్కిష్ తయారీ బైరెక్టర్ టీబీ 2 డ్రోన్లు, పాక్ స్వదేశీ తయారీ షాపర్-1 డ్రోన్లు ఉన్నాయి. పాక్ డ్రోన్ యుద్ధ వ్యూహాలకు నూర్ ఖాన్ ఎయిర్ బేస్ కేంద్రంగా ఉంది. ఇది పాక్ అధ్యక్షుడి విమానాలతో పాటు దేశంలో ఉన్న పైలట్ శిక్షణ, వీఐపీ విమానాలకు కేంద్రంగా ఉంది. మే 11 తెల్లవారుజామున ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తనకు ఫోన్ చేసి, భారత్ నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌పై క్షిపణులతో దాడులు చేసిందని చెప్పారని ఇటీవల ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. మే 10న, పాకిస్తాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ఉదయం 4 గంటల విలేకరుల సమావేశంలో భారతదేశం నూర్ ఖాన్ (రావల్పిండి), మురిద్ (చక్వాల్), మరియు రఫికి (ఝూంగ్) వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ధృవీకరించారు.

# ఆర్మీ ఉద్యోగినంటూ సైబర్ మోసం.. రూ.1.30లక్షలు నష్టపోయిన మహిళ



హైదరాబాద్,26 మే (క్రాంతి న్యూస్ ): ఆన్‌లైన్‌లో వస్తువులు కొనే క్రమంలో ఓ మహిళ రూ. 1.30 లక్షలు పోగొట్టుకున్నారు. ఫర్నిచర్ అమ్ముతున్నట్లు క్వికర్‌లో వచ్చిన పోస్టుకు ఆమె స్పందించి మొబైల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పెట్టారు. ఆర్మీ అధికారినంటూ ఓ మోసగాడు ఆమెను సంప్రదించాడు. ముందస్తుగా 20 శాతం డబ్బు చెల్లిస్తే వస్తువులు డెలివరీ చేస్తానని చెప్పాడు. ఫర్నిచర్‌తోపాటు ల్యాప్‌టాప్, వేరే వస్తువులు విక్రయిస్తానని జీఎస్టీ పేరుతో మొత్తం రూ.1.30లక్షలు కాజేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# డయాబెటిస్‌తో బాధపడేవారు.. థైరాయిడ్‌తో జాగ్రత్త ఉండాల్సిందే..!

హెల్త్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): భారతదేశంలో ప్రతి 10 మందిలో ఒకరు థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతి 11 మందిలో ఒకరు డయాబెటిస్ బారిన పడుతున్నారు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏంటంటే ఈ రెండు వ్యాధులు ఒకదానికి ఒకటి ముడి పడి ఉన్నాయని. నిజానికి టైప్ 2 డయాబెటిస్ ఉన్న ప్రతీ నలుగురిలో ఒకరికి హైపోథైరాయిడిజం కూడా ఉంటుంది. ఇది థైరాయిడ్ గ్రంథి పనిచేయని పరిస్థితి.



## థైరాయిడ్, మధుమేహం మధ్య సంబంధం ఏంటి..?

థైరాయిడ్ అనేది ఆడమ్స్ ఆపిల్ (గొంతు ముందు భాగంలో కనిపించే ఉబ్బెత్తు భాగం) క్రింద, మెడ దిగువ భాగంలో ఉండే సీతాకోకచిలుక ఆకారపు గ్రంథి. ఇది శరీరం యొక్క జీవక్రియను నియంత్రిస్తుంది. ఈ విధమైన నియంత్రణ శరీరం శక్తిని ఉపయోగించుకునే తీరును, నిల్వ తీరును ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ హార్మోన్లు, ఇన్సులిన్ అనేవి శరీర శక్తి నిర్వాహకుల వంటివి. థైరాయిడ్ హార్మోన్లు మీ శరీరం ఎంత వేగంగా శక్తిని ఉపయోగిస్తుందో అనే దాన్ని నియంత్రించడంలో సహాయ పడతాయి. ఇన్సులిన్ మీ రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. మీ జీవక్రియ సజావుగా సాగడంలో ఈ రెండూ కలిసి పెద్ద పాత్ర పోషిస్తాయి. కాబట్టి, థైరాయిడ్ పనితీరు దెబ్బతిన్నప్పుడు, అది రక్తంలో చక్కెర నియంత్రణను ప్రభావితం చేస్తుంది.

ఈ సందర్భంగా అబాట్ ఇండియా మెడికల్ అఫైర్స్ హెడ్ డాక్టర్ రోహిత శెట్టి మాట్లాడుతూ.. డయాబెటిస్‌తో బాధపడేవారు రక్తంలో చక్కెర స్థాయిల గురించి తెలుసుకోవాలి. హెచ్చుతగ్గులను ఎలా నిర్వహించాలో తెలుసుకోవాఇ. కానీ థైరాయిడ్ రుగ్మతలు రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేసినప్పటికీ, గుర్తించబడకపోవచ్చు. అందుకే క్రమం తప్పకుండా థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. సరైన జాగ్రత్తతో, థైరాయిడ్ రుగ్మతలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు, ప్రజలు ఆరోగ్యంగా, చురుకైన జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తుందన్నారు.

అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎండోక్రినాలజీ (హైదరాబాద్)కు చెందిన కన్సల్టంట్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ లావణ్య ఆలపాటి మాట్లాడుతూ.. థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు తరచుగా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఫలితంగా అవసరమైన సంరక్షణను అందుకోలేకపోతున్నారు. డయాబెటిస్ ఉన్న చాలా మందికి గుర్తించదగిన లక్షణాలు లేకుండా థైరాయిడ్ సమస్యలు ఉండవచ్చు. అలసట, జ్ఞాపకశక్తి లోపాలు, నిద్రలేమి, అధిక బరువు పెరగడం మొదలుకొని మలబద్ధకం, పొడి చర్మం, చలిని తట్టుకోలేకపోవడం, కండరాల తిమ్మిరి, ఉబ్బిన కనురెప్పలు దాకా ఈ లక్షణాలు ఉంటాయి. థైరాయిడ్ గ్రంథి పనిచేయకపోవడం వల్ల శక్తి స్థాయిలు, బరువు, మానసిక స్థితి, హృదయ స్పందన రేటులో హెచ్చుతగ్గులు కూడా వస్తాయి. ఎందుకంటే ఈ విధులను నియంత్రించడంలో, శరీర ఆరోగ్యకరమైన అభివృద్ధికి మద్దతు ఇవ్వడంలో ఈ గ్రంథి ముఖ్యమైన పాత్ర పోషి స్తుంది. అందుకే ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి థైరాయిడ్ పనితీరు కోసం క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం చాలా ముఖ్యం అని సూచించారు. థైరాయిడ్, మధుమేహంతో బాధపడేవారు మూత్రపిండాల సమస్యలు, గుండె పనితీరు సరిగా లేకపోవడం, రక్త ప్రసరణ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. నరాలు దెబ్బతినడం, గుండె జబ్బులు వంటి సమస్యలకు దారితీయవచ్చునని పేర్కొన్నారు.

రక్తంలో చక్కెర నియంత్రణను ప్రభావితం చేసే థైరాయిడ్ రుగ్మతల రకాలు:

### హైపోథైరాయిడిజం (థైరాయిడ్ పనితీరు తగ్గడం)

హైపోథైరాయిడిజం శరీరం ఇన్సులిన్‌ను ప్రాసెస్ చేసే విధానాన్ని నెమ్మదింపజేస్తుంది. దీని అర్థం ఇన్సులిన్ రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది, ఇది రక్తంలో చక్కెరలో ఊహించని తగ్గుదలకు కారణమవుతుంది. ఇది జీవక్రియను నెమ్మదిస్తుంది, బరువు పెరగడానికి, ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం కష్టమవుతుంది. మధుమేహం ఉన్నవారిలో, అత్యంత సాధారణమైన థైరాయిడ్ రుగ్మత సబ్‌క్లినికల్ హైపోథైరాయిడిజం, ఇది మీ థైరాయిడ్ గ్రంథి సాధారణంగా పనిచేయని పరిస్థితి, కానీ కనిపించే లక్షణాలు ఏవీ ఉండవు. రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పుల కారణంగా టైప్ 2 డయాబెటిస్ హైపోథైరాయిడిజం వచ్చే ప్రమాదాన్ని కూడా పెంచుతుంది.

### హైపర్ థైరాయిడిజం (అతి చురుకైన థైరాయిడ్)

హైపర్ థైరాయిడిజం జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల శరీరం ఆహారం నుండి గ్లూకోజ్‌ను త్వరగా గ్రహిస్తుంది. అయినప్పటికీ, కణాలు ఇన్సులిన్‌కు తక్కువ ప్రతిస్పందనను కలిగిస్తాయి, దీని వలన రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీనివల్ల డయాబెటిస్ ఉన్నవారికి స్థిరమైన గ్లూకోజ్ స్థాయిలను నిర్వహించడం సవాలుగా మారుతుంది. హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం రెండూ రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి, కాబట్టి క్రమం తప్పకుండా పర్యవేక్షణ, నిర్వహణ అవసరం.

థైరాయిడ్ పనిచేయకపోవడాన్ని పరిష్కరించడం వల్ల మధుమేహ నియంత్రణకు సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మీ వైద్యులు సూచించిన సకాలంలో మందులు వాడడం వల్ల థైరాయిడ్, రక్తంలో చక్కెర స్థాయిలు రెండూ అదుపులో ఉంటాయి. మీ వైద్యులు సూచించిన విధంగా థైరాయిడ్ పని తీరు, బ్లడ్ షుగర్ టెస్టింగ్ కోసం క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం వల్ల ఏవైనా మార్పులు ముందుగానే నిర్ధారణ అయ్యేలా చూసుకోవచ్చు.

చురుకుగా ఉండటం, బాగా తినడం, తగినంత నిద్రపోవడం ద్వారా మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోవడం నిజంగా సహాయపడుతుంది. మీకు థైరాయిడ్ రుగ్మతలు, మధుమేహం రెండూ ఉంటే, మీరు మీ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహిం చాల్సి రావచ్చు. అలా శ్రద్ధ వహించడం వల్ల మీకు ఇష్టమైన కార్యకలాపాలను ఆస్వాదించడానికి మీకు మరింత శక్తి లభిస్తుంది.

# మెదడు మస్తు పని చేయాలన్నా, జ్ఞాపకశక్తి పెరగాలన్నా ఇలా చేయండి..!



హెల్త్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): ప్రతిరోజూ కొన్ని నిమిషాలు ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఇది ఏకాగ్రతను పెంచుతుంది. ఒత్తిడిని దూరం చేయడం ద్వారా మెదడు ఆలోచనలను స్పష్టంగా ఉంచుతుంది. ఈ ప్రశాంతత వల్ల మన జ్ఞాపకశక్తి బలంగా మారుతుంది. ఉదయం లేదా రాత్రి నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ధ్యానం చేయడం మంచిది.

ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా నేర్చుకోవడం, తెలుసుకోవడం వల్ల మెదడు చురుకుగా ఉంటుంది. ఇది ఒక వ్యాయామం లాంటిది. సంగీతం నేర్చుకోవడం, కొత్త భాషలపై ఆసక్తి చూపించడం, కొత్త విషయాలను చదవడం వల్ల మన మెదడు పదునుగా మారుతుంది. దీనివల్ల జ్ఞాపకశక్తి స్థిరంగా ఉంటుంది.

మంచి నిద్ర మన మెదడుకు చాలా అవసరం. ప్రతిరోజూ 7 నుండి 8 గంటల పాటు హాయిగా నిద్రపోవడం తప్పనిసరి. నిద్ర సరిపోకపోతే మానసిక సామర్థ్యం తగ్గిపోతుంది. కాబట్టి నిద్రను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. పడుకునే ముందు నెమ్మదిగా పాటలు వినడం, మొబైల్‌ను దూరంగా పెట్టడం వంటి చిన్న మార్పులు బాగా సహాయపడతాయి.

చిన్న విషయాలను పెద్దవిగా భావించకుండా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. దీని కోసం యోగా, మైండ్‌ఫుల్‌నెస్, ప్రాణాయామం వంటి పద్ధతులు మంచివి. మనం చేసే పనుల పట్ల ఆనందాన్ని పొందడం, మనసును సానుకూలంగా ఉంచుకోవడం మెదడుకు శక్తిని ఇస్తాయి. ఒత్తిడి తగ్గితే జ్ఞాపకశక్తి సహజంగా మెరుగుపడుతుంది.

మెదడు ఆరోగ్యానికి మంచివైన కొన్ని ఆహార పదార్థాలను రోజూ తినాలి. ఆకుకూరలు, బాదం, వాల్ నట్, సన్ ఫ్లవర్ విత్తనాలు, బ్లూబెర్రీస్, క్వినోవా లాంటి తృణధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలి. అదే సమయంలో కొవ్వు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఎక్కువ తీపి పదార్థాలు తగ్గించాలి.

కేవలం శరీరానికి మాత్రమే కాకుండా.. మెదడుకు కూడా వ్యాయామం అవసరం. సుడోకు, చెస్, మెమొరీ గేమ్స్, పజిల్స్ వంటి ఆటలు మెదడు బాగా పని చేసేలా చేస్తాయి. ఇవి ఆలోచనా సామర్థ్యాన్ని, విషయాలను గుర్తించే శక్తిని మెరుగుపరుస్తాయి. తరచుగా ఈ రకమైన ఆటలు ఆడటం వల్ల మెదడు పదునుగా ఉంటుంది.

జ్ఞాపకశక్తి బలంగా ఉండాలంటే చిన్న చిన్న అలవాట్లు చాలా అవసరం. ఈ ఆరు చిట్కాలను మీ రోజువారీ జీవితంలో భాగం చేసుకుంటే మీ తెలివితేటలు, చురుకుదనం, ఏకాగ్రత అన్నీ మెరుగుపడతాయి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా సమానంగా శ్రద్ధ



# క్రీడలు





## రన్నరప్ శ్రీకాంత్



స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ):మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. నిలకడగా రాణించి ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టిన శ్రీకాంత్.. ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో శ్రీకాంత్ 11-21, 9-21తో రెండో సీడ్ లీ షె ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశాడు. 36 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో శ్రీకాంత్‌పై ప్రత్యర్థి సంపూర్ణ ఆధిపత్యం కనబరిచాడు. “మళ్లీ ఆడుతున్నందుకు ఆనందంగా ఉంది. కెరీర్‌లో ఒకప్పుడు తరచూ పోడియం మీద నిల్చునేవాడిని. మరోసారి అక్కడికి చేరుకోవడం నాకెంతో ప్రత్యేకం. ఈ వారం అద్భుతంగా సాగింది. ఈ సీజన్లో నాకిది మూడో టోర్నీ. మొదటి రెండు బాగానే ఆడినా గెలవలేకపోయా. ఈ టోర్నీలో ప్రదర్శన నాకు సంతృప్తినిచ్చింది. ఫైనల్లో అనుకున్నట్లుగా ఆడలేకపోయా. ప్రత్యర్థి బాగా ఆడాడు” అని శ్రీకాంత్ తెలిపాడు.

## పంత్‌ను చూసి నేర్చుకోండి’.. రహానేపై సెహ్వాగ్ ఫైర్

స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): ఐపీఎల్-2025 సీజన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఘోర ఓటమితో ముగించింది. ఆదివారం ఢిల్లీ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 110 పరుగుల తేడాతో కేకేఆర్ పరాజయం చవిచూసింది. ఈ ఏడాది సీజన్ అసాంతం దారుణ ప్రదర్శన కనబరిచిన డిఫెండింగ్ ఛాంపియన్.. వరుస ఓటములతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. శ్రేయస్ అయ్యర్ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన వెటరన్ ఆటగాడు అజింక్య రహానే జట్టును విజయం పథంలో నడిపించడంలో



విఫలమయ్యాడు. వ్యక్తిగత ప్రదర్శన పరంగా పర్వాలేదన్పించినప్పటికి, కెప్టెన్‌గా మాత్రం రహానే పూర్తిగా తేలిపోయాడు.ఈ ఏడాది సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఐదింట మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో కేకేఆర్ మెనెజ్‌మెంట్‌పై మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. రహానే టాప్-3లో బ్యాటింగ్‌కు రావడాన్ని సెహ్వాగ్ తప్పుబట్టాడు.“కెప్టెన్ టాప్ త్రీలోనే బ్యాటింగ్ చేయాలని ఎక్కడా రాసిలేదు. పంత్‌ను చూసి నేర్చుకోండి. అతడు తన ఫామ్‌లో లేని అని తెలిసి మిగితా ఆటగాళ్లను తనకంటే ముందు బ్యాటింగ్‌కు పంపుతున్నాడు. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లు టాపర్డర్‌లో బ్యాటింగ్‌కు రావడంతో లక్నో భారీ స్కోర్ సాధించగలుగుతుంది.కేకేఆర్ అలాగే చేసి ఉంటే బాగుండేది. అది టీమ్ మెనెజ్‌మెంట్, కోచింగ్ స్టాప్ బాధ్యత. నిన్న గుజరాత్‌తో మ్యాచ్‌లో కూడా సీఎస్‌కే అదే పనిచేసింది. ఫామ్‌లో ఉన్న డెవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబేలను ముందు బ్యాటింగ్‌కు పంపారు” అని క్రిక్‌బజ్ లైవ్ షో సెహ్వాగ్ పేర్కొన్నాడు.

## ఆర్‌సీబీకి కొత్త జోష్ జట్టుతో కలిసిన హాజిల్‌వుడ్



స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): ప్లేఆఫ్స్‌కు ముందు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అభిమానులకు అదిరిపోయే శుభవార్త. ఆ జట్టు స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ లక్నోలో జట్టుతో కలిశాడు. భారత్-పాక్ దేశాల ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వారం రోజులు వాయిదా పడటంతో ఆస్ట్రేలియాకు వెళ్లిపోయిన ఈ ఆసీస్ పేసర్ తిరిగి రావడం కష్టమేనని అనుకున్నా.. ఎట్టకేలకు అతడు జట్టుతో కలవడంతో బెంగళూరు బౌలింగ్ విభాగం పటిష్టమైంది.

## జూన్‌లో ఇంగ్లండ్ పర్యటన.. జియో హాట్‌స్టార్‌కు డిజిటల్ హక్కులు..!



స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేస్తున్న జియో సంస్థ మరోమారు అభిమానులకు క్రీడా వినోదం పంచనుంది. త్వరలో భారత్, ఇంగ్లండ్ ఐదు టెస్టు మ్యాచ్‌ల డిజిటల్ మీడియా హక్కుల ను జియో హాట్‌స్టార్ దక్కించుకుంది. సోనీ స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడె సంస్థలతో పోటీపడి .. డిజిటల్ రైట్స్ సొంతం చేసుకుందని సమాచారం. ఈ విషయాన్ని క్రిక్‌బజ్ సోమవారం వెల్లడించింది.

జూన్‌లో మొదలయ్యే ఇంగ్లండ్ పర్యటన డిటిటల్ హక్కుల కోసం ఏప్రిల్ నెల నుంచే జియో హాట్‌స్టార్, సోనీ స్పోర్ట్స్, కల్వర్ మ్యాక్స్ సంస్థల మధ్య మంతనాలు జరుగుతున్నాయి. అయితే.. భారత జట్టుకు కొత్త కెప్టెన్‌గా శు భ్‌మన్ గిల్ ను ప్రకటించిన తర్వాత చర్చలు చివరి దశకు వచ్చాయి. ఎట్టకేలకు ఆదివారం జియో హాట్‌స్టార్ ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్ డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. అయితే.. సోనీ సంస్థ కూడా డిజిటల్ మ్యాచ్‌లను ప్రసారం చేసేందుకు ఇరువురి మధ్య అంగీకారం కుదిరింది.

అంతేకాదు.. సోనీ టీవీ నెట్‌వర్క్‌లో కూడా భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయితే.. ఇరు జియో, సోనీల మధ్య ఈ ఒప్పందం వచ్చ ఏడాది వరకూ కొనసాగనుంది. 2026లో భారత్.. ఇంగ్లండ్ పర్యటనలో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ ఎనిమిది మ్యాచ్‌లను జియో హాట్‌స్టార్‌లో అభిమానులు ఆస్వాదించవచ్చని క్రిక్‌బజ్ తెలిపింది.

### జూన్ 20న తొలి టెస్టుతో

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇరుజట్ల మధ్య జూన్ 20న టెస్టుతో సిరీస్ మొదలవ్వనుంది. జూలై 2న బర్మింగ్‌హామ్‌లో రెండో టెస్టు, అనంతరం జూలై 10న లార్డ్స్ వేదికగా మూడో టెస్టు, మాంచెస్టర్‌లో జూలై 23న నాలుగో మ్యాచ్.. ఓవల్‌లో జూలై 31న ఐదో టెస్టు జరుగనుంది.

## భారత్ ఖాతాలో మరో రజతం, కాంస్యం



స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత యువ షూటర్లు అదరగొడుతున్నారు. ఆదివారం జరిగిన పది మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం, కాంస్యం దక్కించుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నరేన్ ప్రణవ్-ఖాయతి చౌదరి ద్వయం.. 631 పాయింట్లు స్కోరు చేసి తృటిలో పసిడి పతకాన్ని కోల్పోయినా రజతంతో సరిపెట్టుకుంది. చైనా జోడీ యుటింగ్-లివాన్లిన్.. 632.6 స్కోరుతో స్వర్ణం గెలుచుకుంది. 14వ షాట్ వరకూ భారత్,చైనా సమాన పాయింట్లతో సాగినా 15వ షాట్‌కు చైనా షూటర్లు.. 0.5 పాయింట్లు ఎక్కువ స్కోరు చేసి పసిడి కైవసం చేసుకున్నారు. ఇక కాంస్య పోరులో హిమాన్షు-శాంభవి జంట.. 629.5 పాయింట్లు స్కోరుతో అమెరికన్ జోడీ గ్రిఫిన్-స్పెన్సర్‌ను ఓడించి కాంస్యం దక్కించుకుంది.

## క్వార్టర్స్‌కు పవన్



స్పోర్ట్స్ న్యూస్ ,26 మే (క్రాంతి న్యూస్ ): థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ పవన్ బర్తాల్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 55 కిలోల విభాగంలో పవన్.. 5-0తో సవా రంగ్సె (కంబోడియా)ను మట్టి కరిపించాడు.బౌట్‌లో సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన బర్తాల్.. పదే పదే ప్రత్యర్థిని బౌట్ కార్నర్ వద్దకు తీసుకెళ్లి పాయింట్లు రాబట్టాడు. అటాకింగ్‌తో పాటు డిఫెన్స్‌లోనూ అతడు కంబోడియా బాక్సర్‌కు పాయింట్లు సాధించే అవకాశమివ్వలేదు.

KR TV క్రాంతి
మంగళవారం 27 మే 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com



# అప్పుడే ఓటీటీలోకి సూర్య రెట్రో..




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రాజెక్ట్ రెట్రో . సూర్య 44 గా వస్తోన్న ఈ మూవీకి కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించాడు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించింది. మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయింది. రెట్రో ఇక డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయింది.

ఈ మూవీ పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో మే 31 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రెట్రో తెలుగు, తమిళంతోపాటు పలు ప్రధాన భారతీయ భాషల్లో సందడి చేయనుంది రెట్రో. థియాట్రికల్ రిలీజైన నెల వ్యవధిలో ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్న ఈ చిత్రం మరి ఎలాంటి స్పందన రాబట్టుకుందనేది చూడాలి.

ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. సూర్య హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మించిన ఈ మూవీకి తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా వర్క్ చేశాడు.

# ఆ స్మెల్ నాకెంతో ఇష్టం

ప్రస్తుతం ఇండియాలోని టాప్ హీరోయిన్లలో రష్మిక మందన్నా మొదటి వరుసలో ఉంటారు. ప్రస్తుతం రూపొందుతోన్న ప్రెస్టేజియస్ సినిమాల్లో ఎక్కువ శాతం కథానాయిక రష్మికే. బాలీవుడ్‌లో సైతం ఈ అందాలభామ వైభవం ఓ రేంజ్‌లో వెలిగిపోతున్నది. ఎంత బిజీగా ఉన్నా సోషల్‌మీడియా ద్వారా అభిమానులకు చేరుగానే ఉంటూ ఉంటుంది రష్మిక. రీసెంట్‌గా సోషల్ మీడియాలో వర్షాలపై ఆసక్తికరంగా ఓ పోస్ట్ పెట్టింది తను. 'వర్షాకాలం వచ్చేసింది. నిజానికి నాకు వర్షాకాలం అంటే ఇష్టం ఉండదు. ఎందుకంటే వర్షాల వల్ల పనులు మందగిస్తాయి. వర్క్ స్పీడ్‌గా జరగదు. అయితే.. వర్షం వచ్చే ముందు వచ్చే మట్టి వాసన అంటే మాత్రం నాకెంతో ఇష్టం. ఆ స్మెల్ వస్తే.. గుండెల నిండా పీల్చేసుకుంటా.' అంటూ పోస్ట్ చేసింది రష్మిక.

# అగ్నివీర్ జిందాబాద్.. ఆర్థిక వ్యవస్థ శభాష్: అమితాబ్ ప్రశంసలు

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడాన్ని ప్రశంసించారు బాలీవుడ్ అగ్ర కథనాయకుడు అమితాబ్ బచ్చన్. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో సైలెంట్‌గా ఉన్న ఆయన నేడు వరుస పోస్ట్‌లు పెట్టారు. భారత్‌ను ప్రశంసించడంతో పాటు అగ్నివీర్‌లను పొగిడారు.

"ఇప్పుడు భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అమెరికా (30.51 లక్షల కోట్ల డాలర్లు), చైనా (19.23 లక్షల కోట్ల డాలర్లు), జర్మనీ (4.74 లక్షల కోట్ల డాలర్లు)ల తర్వాత భారత్ (4.19 లక్షల కోట్ల డాలర్లు) నిలిచింది. మరో మూడు సంవత్సరాల్లో మన దేశం మూడో స్థానాన్ని కైవసం చేసుకుంటుంది" అని పేర్కొన్నారు.



మరో పోస్ట్‌లో అగ్నివీర్‌ల ఫొటో షేర్ చేస్తూ.. 'అగ్నివీర్ జిందాబాద్, భారత్ మాతాకు జై, జైహింద్' అని రాసుకొచ్చారు.ఇక పహల్గాం ఉగ్రదాడి జరిగిన 20 రోజుల తర్వాత అమితాబ్ బచ్చన్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "చేతిలో చితాభస్మం ఉంది.. ప్రపంచం సిందూరం కోరుతోందని" అని తన తండ్రి రాసిన కవితలో ఓ లైన్‌ను పోస్ట్ చేశారు. 'భారత సైన్యమా.. నువ్వు ఎప్పటికీ వెనకడుగు వేయవు. నీ ప్రయాణం ఎప్పటికీ ఆగదు' అంటూ సైనిక దళాలపై ప్రశంసలు కురిపించారు. ఆ దాడి తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు.

# మ్యాడ్ స్క్వేర్‌తో రచ్చ చేశాడు.. ఇప్పుడు గ్యాంబ్లర్స్‌తో..

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచిన హీరో సంగీత్ శోభన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం గ్యాంబ్లర్స్. రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కెఎస్‌కె చైతన్య దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో ప్రశాంతి చారులింగా కథానాయికగా నటిస్తోంది. రాకింగ్ రాకేశ్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. థ్రిల్లింగ్, ఆశ్చర్యపోయే అంశాలతో ఈ చిత్రాన్ని మేకర్స్ రూపొందించారు.

జూన్ 6న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానుండగా, చిత్రబృందం ప్రమోషన్ స్పీడ్ పెంచింది. ఈ క్రమంలో తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి.. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి అనే డైలాగ్ ఆకట్టుకుంటోంది. పేకాట జూదం నేపథ్యంలో ఈ మూవీ రూపొందినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. ఈ సినిమాతో మ్యాడ్ హీరో మరో హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు. ఇక ఈ చిత్రంలో జబర్దస్త్ ఫేం రాకింగ్ రాకేష్ పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, , జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.


ఇదొక వైవిధ్యమైన కథతో మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్నట్లు ఇటీవల దర్శకుడు చైతన్య చెప్పుకొచ్చారు. సంగీత్ నటనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రం ఇదికాగా, ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడంతో పాటు ఆశ్చర్యపరుస్తాయని అంటున్నారు. మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆర్ఆర్ఆర్, బాహుబలి రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ రూపొందగా,ఈ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు ఈ సినిమాను నిర్మిస్తుండడంతో మూవీపై ఆసక్తి నెలకొంది. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్ననేపథ్యంలోఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# నేను అసూయపడిన నటుల్లో మీరూ ఒకరు



'నేను అసూయపడే నటుల్లో మీరు ఒకరంటూ జోజూ జార్జ్ వైపు చూస్తూ కమల్ చెప్పడంతో ఆయన భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. కమల్‌హాసన్ , దర్శకుడు మణిరత్నం కాంబినేషన్లో రూపొందిన 'థగ్ లైఫ్' జూన్ 5న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఆడియో ఆవిష్కరణ వేడుకలో ఈ వ్యాఖ్యలు చేశారు కమల్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కన్నడ నటుడు శివరాజ్ కుమార్ తనను సూపర్‌స్టార్ హోదాలో ప్రదర్శించుకోలేదని, ఓ కొడుకు స్థానంలో, అభిమానిగా, అభిమానుల ప్రతినిధిగా ఇక్కడకు వచ్చారని తెలిపారు. జోజూ జార్జ్ 'ఇరట్ట' చిత్రంలో చేసిన ద్విపాత్రాభినయం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఈ చిత్రంలోని రెండు పాటలను కమల్‌హాసన్ కుమార్తె, నటి శ్రుతిహాసన్ , సంగీత దర్శకుడు ఏఆర్.రెహమాన్ వేదికపై స్వయంగా ఆలపించారు. కార్యక్రమంలో దర్శకుడు మణిరత్నం, నటులు నాజర్, శింబు, అభిరామి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com